

మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలి

కేంద్ర ప్రభుత్వం వెంటనే మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని శాంతి చర్చల కమిటీ చైర్మన్ జస్టిస్ చంద్రకుమార్ డిమాండ్ చేశారు. - 8లో▸



'ఎల్‌సీ' నిర్లక్ష్యంపై సీఎండీ అసహనం

ఎల్‌సీ యాప్ వినియోగంలో నిర్లక్ష్యంపై విద్యుత్ ఇంజనీర్లు, ఆపరేటర్లపై టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్‌రెడ్డి అసహనం వ్యక్తం చేశారు. - 8లో▸

గరిష్ఠం/కనిష్ఠం
32.6° /22.3°

వాతావరణం

జిల్లాలో ఉదయం వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. మధ్యాహ్నం పలుచోట్ల ఆకాశం మేఘావృతమై అకాల వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

మున్సిపాలిటీని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తా



భూపాలపల్లి రూరల్: భూపాలపల్లి మున్సిపాలిటీని అన్ని విధాలుగా అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే గండ్ర సత్యనారాయణరావు అన్నారు. బుధవారం భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని పుల్లూరిరామయ్యపల్లితో పాటు వేశాలపల్లిలో వివిధ అభివృద్ధి పనులకు మున్సిపాలిటీ కమిషనర్ బిర్రు శ్రీనివాస్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ముందుగా పుల్లూరిరామయ్యపల్లి పెద్దకుంటపల్లి నుంచి పుల్లూరి రామయ్యపల్లి వరకు టీయుఎఫ్ఐడీసీ నిధుల నుంచి నూతనంగా నిర్మించనున్న కల్వర్టులు, బీటీ రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. వేశాలపల్లిలో డ్రెయినేజీ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భూపాలపల్లి మున్సిపాలిటీ అభివృద్ధికి శక్తివంచన లేకుండా పని చేస్తున్నానన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు దాట్ల శ్రీనివాస్, ఆకుల మహేందర్, రవి తదితరులు పాల్గొన్నారు.

విద్యాప్రమాణాలు మెరుగుపర్చాలి



మల్హర్: విద్యార్థులకు అర్థవంతంగా బోధించి పాఠశాలల్లో విద్యాప్రమాణాలు మెరుగుపర్చేందుకు ప్రతీ ఉపాధ్యాయుడు కృషి చేయాలని జిల్లా విద్యాధికారి రాజేందర్ అన్నారు. మండలంలోని వల్లెకుంట జిల్లా పరిషత్ పాఠశాలలో మండల విద్యాధికారి లక్ష్మణ్‌బాబు ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు జరుగుతున్న శిక్షణ తరగతులను బుధవారం డీఈఓ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీ ఉపాధ్యాయులు శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోని విద్యార్థులకు మంచి విద్యను అందించాలన్నారు. ఉపాధ్యాయులు మారుతున్న కాలానికి అనుగుణంగా అప్‌డేట్ కావాలన్నారు. వచ్చే విద్యా సంవత్సరంలో ప్రతీ పాఠశాలలో విద్యార్థుల నమోదు పెరిగేలా కృషి చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

శిక్షణతో బోధన నైపుణ్యాలు పెంపు

కాటారం: ఎఫ్ఎల్ఎన్ శిక్షణ ద్వారా ఉపాధ్యాయుల్లో బోధన నైపుణ్యాలు పెంపొందుతాయని జిల్లా విద్యాధికారి రాజేందర్ అన్నారు. కాటారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కొనసాగుతున్న ఎఫ్ఎల్ఎన్ ప్రాథమిక స్థాయి శిక్షణ కార్యక్రమాన్ని బుధవారం డీఈఓ పరిశీలించారు. శిక్షణ కొనసాగుతున్న తీరు, హాజరైన ఉపాధ్యాయు ల వివరాలు ఆరా తీశారు. ప్రతీ ఉపాధ్యాయుడు శిక్షణ తరగతులను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. డీఈఓ వెంట ఏఎంఓ లక్ష్మణ్, ఎంఈఓ శ్రీదేవి, రిసోర్స్‌పర్సన్స్ తదితరులు ఉన్నారు.

ప్లాస్టిక్ నిషేధంలో భాగస్వాములు కావాలి



కాళేశ్వరం: కాళేశ్వరంలోని సరస్వతీ పుష్కరాలకు వచ్చే భక్తులు ప్లాస్టిక్ వినియోగాన్ని నిషేధించి పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని కాలుష్య నియంత్రణ మండలి ప్రాజెక్టు అధికారి సత్తయ్య తెలిపారు. ఈ మేరకు ప్రజలకు ప్లాస్టిక్ వినియోగం, విసిరివేయంపై అవగాహన కల్పించేందుకు తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో రూపొందించిన 'సరస్వతీ పుష్కరాలు పరిశుభ్ర పుష్కరం – పవిత్ర పుష్కరం అనే వాల్ పోస్టర్లను బస్సులకు అంటించారు. భక్తులు వాడే ప్లాస్టిక్ నది జలాల్లో కలవడంతో పవిత్రమైన నది జలాలు కలుషితమవుతాయన్నారు. ప్లాస్టిక్ వినియోగాన్ని తగ్గించాలన్నారు.

'సదస్సును విజయవంతం చేయాలి'

ములుగు: ఈ నెల 24న కాకతీయ విశ్వవిద్యాలయంలో నిర్వహించనున్న ఉమ్మడి వరంగల్ జిల్లా సదస్సును విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ జాతీయ నేత, ఉమ్మడి వరంగల్ ఇన్‌చార్జ్ మంద కుమార్‌మాదిగ పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం జిల్లా అధ్యక్షుడు శ్యాంబాబు అధ్యక్షతన నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో అనుబంధ సంఘాల భవిష్యత్ కార్యాచరణను ప్రకటిస్తామన్నారు.

పుష్కరిణిలో స్నానాలు ఆచరిస్తున్న భక్తులు



పుష్కర స్నానం.. ముక్తీశ్వర దర్శనం

సరస్వతీనది పుణ్య స్నానాలకు భక్తుల రద్దీ

- వివిధ రాష్ట్రాల నుంచి భక్తుల రాక
- ఎమ్మెల్యేలు వినోద్, అనిరుధ్‌రెడ్డి, అంబర్‌కిశోర్‌ఝా, ఎస్పీ శ్రీనివాసరావులు పుణ్యస్నానాలు
- ఏడో రోజు లక్షకుపైగా తరలి వచ్చిన జనం
- వర్షంతో చల్లబడిన వాతావరణం

భూపాలపల్లి/కాళేశ్వరం: కాళేశ్వరంలో జరుగుతున్న సరస్వతీనది పుష్కరాలకు భక్తులు రోజురోజుకు భారీగా తరలివస్తున్నారు. బుధవారం ఏడోరోజు తెలంగాణతో పాటు ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్‌ల నుంచి భక్తులు కాళేశ్వరానికి తరలివచ్చారు. గోదావరి, ప్రాణహిత, అంతర్వాహిని సరస్వతీనదికి పుష్కర పుణ్యస్నానాలు ఆచరించి, నదీమాతకు పూజలు చేశారు. పిండప్రధాన పూజలు చేశారు. నదీమాతకు చీరె, సారెను సమర్పించారు. దంపతిస్నానాలు చేశారు. ముత్తయిదువ మహిళలు వాయినాలు ఇచ్చిపుచ్చుకున్నారు. భక్తులతో గోదావరితీరం వద్ద భక్తప్రవాహం కనిపించింది. నదిలో దీపాలు వదిలి మొక్కులు చెల్లించారు. ఇసుకలో సైకత లింగాలు చేసి పూజించారు. కాళేశ్వరాలయంలో కాళేశ్వరముక్తీశ్వరున్ని దర్శించుకున్నారు.

అలరిస్తున్న స్టాళ్లు

సరస్వతీఘాట్ వద్ద ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన స్టాళ్లు భక్తులను అలరిస్తున్నాయి. ఫుడ్‌కోర్టులు, వస్త్రాలు, పిల్లల ఆటలు అందరిని ఆకట్టుకుంటున్నాయి. కాగా రానున్న ఐదు రోజులు పాటు భక్తుల సంఖ్య పెరిగే అవకాశం ఉన్నందున్న అదనంగా పార్కింగ్ స్థలాలను అడిషనల్ కలెక్టర్ అశోక్‌కుమార్, అడిషనల్ ఎస్పీ బోనాల కిషన్‌లు పరిశీలించారు.

వర్షంతో ఇబ్బందులు

రెండు రోజులుగా ఉక్కపోత, ఎండతీవ్రతతో తలడిల్లిన భక్తులకు బుధవారం సాయంత్రం గంట పాటు వర్షం పడడంతో వాతావరణం ఒక్కసారిగా చల్లబడింది. దీంతో భక్తజనం చల్లని వాతావరణాన్ని ఆస్వాదించారు. మరో వైపు పుష్కరఘాటులో పార్కింగ్‌స్థలాలు బురదమయంగా మారాయి. పార్కింగ్‌లో ఉన్న వాహనాలు బయటకు రావడానికి దిగబడి మొరాయించాయి. గాలి దుమారానికి బస్టాండ్ సమీపంలో హైదరాబాద్ అల్వాల్‌కు చెందిన ఉజ్వల్ అనే భక్తుడి తలపై రేకు లేచి పడి తీవ్ర గాయం అయింది. రక్తస్రావం కాగా, వెంటనే అంబులెన్స్ ద్వారా మహదేవపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి వైద్యసేవలందించారు.



పుష్కరిణికి మొక్కుతున్న దంపతులు

తాగునీరు, మజ్జిగ అందజేత

భక్తులకు దేవాదాయశాఖ ఆధ్వర్యంలో తాగునీరు, మజ్జిగ ప్యాకెట్లు అందించారు. ప్రధాన తూర్పు ద్వారం, దక్షిణ ద్వారాల ద్వార క్యూలైన్‌లలో భక్తులను ఎప్పటికప్పుడు క్లియర్ చేశారు. ఉత్సవ కమిటీ సభ్యులు నిరంతరం అక్కడే ఉంటూ భక్తులకు సేవలందిస్తున్నారు. ఆర్‌డబ్ల్యూఎస్ ద్వారా పుష్కరఘాటు, నదీతీరం, కాళేశ్వరాలయం ప్రాంతంలో చల్లని తాగునీరు అందిస్తున్నారు.

హైదరాబాద్, వరంగల్, భూపాలపల్లి రహదారి మీదుగా, పెద్దపల్లి, మంథని, కాటారం మీదుగా వాహనాలు తరలివచ్చాయి. సిరొంచ అంతరాష్ట్ర వంతెన గుండా మంచిర్యాల, గోదావరిఖని, చెన్నూర్, ఆసీఫాబాద్, నిర్మల్‌ల నుంచి భక్తులు తరలి వచ్చారు. ట్రాఫిక్ జామ్ కాకుండా పోలీసులు డివైడర్‌లు ఏర్పాటుతో నియంత్రించారు. ఆరోరోజు తగ్గిన భక్తులు, ఏడో రోజు రెట్టింపుగా తరలివచ్చారు. వివిధ రాష్ట్రాల నుంచి ఆర్టీసీ, ప్రైవేట్ వాహనాల్లో భక్తులు త్రివేణి సంగమం సరస్వతీ నదికి వచ్చి పుష్కర స్నానాలు ఆచరించారు. శ్రీకాళేశ్వర ముక్తీశ్వరస్వామి ఆలయంలో భక్తులు దర్శనానికి క్యూలైన్‌లో బారులుదీరారు. ఆలయంలో దర్శనాలు చేసుకున్నారు. ప్రాకారదేవతలకు మొక్కులు చెల్లించారు. శ్రీశుభానంద దేవి, మహా సరస్వతి అమ్మవార్లను దర్శించుకున్నారు. ఏడోరోజు లక్షకుపైగా మంది భక్తులు పుష్కర స్నానాలు చేసి దర్శనాలు చేసుకున్నట్లు అధికారుల అంచనా. ఘాటు వద్ద సింగరేణి రెస్క్యూటీం సేవలను కలెక్టర్ రాహుల్‌శర్మ అభినందించారు.

ఏడో రోజు లక్షకుపైగా...



సరస్వతీ పుష్కరఘాట్‌కు వస్తున్న భక్తులు



వర్షంలో తడుస్తూ వస్తున్న భక్తులు



కాళేశ్వరాలయంలో ప్రత్యేక పూజలో కలెక్టర్ రాహుల్‌శర్మ దంపతులు

ప్రముఖుల పూజలు

సరస్వతీనది పుష్కరాలకు ప్రముఖులు బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్, జడ్చర్ల ఎమ్మెల్యే అనిరుధ్ రెడ్డి, రామగుండం సీపీ అంబర్‌కిశోర్‌ఝా, ఆసీఫాబాద్ ఎస్పీ శ్రీనివాసరావులు పుష్కర నదిలో స్నానాలు చేసి కాళేశ్వరముక్తీశ్వరున్ని దర్శించుకున్నారు. అలాగే జిల్లా కలెక్టర్ రాహుల్‌శర్మ దంపతులు కుటుంబ సమేతంగా సరస్వతీఘాటు పుష్కరిణిలో పుణ్యస్నానాలు చేశారు. అనంతరం శ్రీకాళేశ్వరముక్తీశ్వరున్ని దర్శించుకున్నారు.



కాళేశ్వరంలో జలమయమైన రోడ్డు

- మరిన్ని ఫొటోలు, వివరాలు 8,9లో▸

చిరు జల్లుల్లో తడుస్తూ.. స్టాళ్లను పరిశీలిస్తూ..

కాళేశ్వరం: కాళేశ్వరంలో సరస్వతీ పుష్కరాల సందర్భంగా ఏర్పాటు చేసిన పలు స్టాళ్లను కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ కిరణ్ ఖరే బుధవారం చిరుజల్లుల్లోనే తడుస్తూ కాలినడకలో పరిశీలించారు. ఈ సందర్భంగా చిట్యాల మండలం జూకల్‌కు చెందిన మధు ఏర్పాటు చేసిన స్టాల్‌లో యంత్రం ద్వారా మొక్కజొన్న కంకులు కాల్చే, ఉడికించే విధానాన్ని పరిశీలించి రుచి చూసి బాగుందని ప్రశంసించారు. వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అత్యవసర వైద్య కేంద్రాన్ని పరిశీలించి రోజువారీగా ఎంత మందికి వైద్య సేవలు అందిస్తున్నారని సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఇందిరా మహిళా శక్తి మహిళలు ఏర్పాటు చేసిన స్టాల్‌ను పరిశీలించి పర్యావరణానికి హాని చేయని, భూమిలో కలిసిపోయే కవర్లను పరిశీలించారు. వర్షాన్ని సైతం లెక్క చేయకుండా జిల్లా బాసులు స్టాళ్ల పరిశీలనకు రావడంతో అధికారులు కూడా వారి వెంట పరుగులు పెట్టాల్సి వచ్చింది. ఈ కార్యక్రమంలో డీఆర్‌డీఓ నరేష్, ఆర్‌డబ్ల్యూస్ ఈఈ నిర్మల, తదితరులు పాల్గొన్నారు.



స్టాళ్ల పరిశీలనకు వెళ్తున్న కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ కిరణ్ ఖరే

ముమ్మరంగా పారిశుధ్య పనులు



బ్లీచింగ్ పౌడర్ చల్లుతున్న పారిశుద్ధ్య కార్మికులు



చెత్తను ట్రాక్టర్‌లో తరలిస్తున్న సిబ్బంది

భూపాలపల్లి అర్బన్: సరస్వతీ పుష్కరాల నేపథ్యంలో కాళేశ్వరం పరిసరాల్లో పారిశుద్ధ్య పనులు ముమ్మరంగా చేపడుతున్నారు. గ్రామ పంచాయతీ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన పారిశుద్ధ్య సిబ్బంది చెత్తను ఎప్పటికప్పుడు తొలగిస్తున్నారు. సరస్వతీ ఘాట్, మొయిన్ ఘాట్, బస్టాండ్, పార్కింగ్ పాయింట్లు, గోదావరికి వెళ్లే రహదారుల్లో, ఆలయ పరిసర ప్రాంతాల్లో పడేసిన చెత్తను ఎప్పటికప్పుడు సేకరిస్తున్నారు. దుర్వాసన రాకుండా, వ్యాధులు ప్రభలకుండా బ్లీచింగ్ పౌడర్ చల్లుతున్నారు. దోమలు వృద్ధి చెందకుండా రాత్రి వేళలో దోమల మందు స్ప్రే చేస్తున్నారు. రోడ్లపై దుమ్ము లేవకుండా ట్రాక్టర్ల ద్వారా నీళ్లు చల్లుతున్నారు. సేకరించిన చెత్తను ఎప్పటికప్పుడు ట్రాక్టర్ల ద్వారా డంపింగ్ యార్డుకు తరలిస్తున్నారు. పారిశుద్ధ్య పనులు చేపట్టేందుకు జిల్లా పంచాయితీ శాఖ ఆధ్వర్యంలో 400 మంది తాత్కాలిక కార్మికులను నియమించారు. పారిశుద్ధ్య పనులు చేపట్టేందుకు 150 మంది ఎంపీడీఓ, ఎంపీఓ, పంచాయతీ కార్యదర్శులు విధులు నిర్వర్తిస్తున్నారు. రెండు షిఫ్టుల్లో పారిశుద్ధ్య కార్యక్రమాలు చేపడుతున్నారు.



దుమ్ము రాకుండా ట్రాక్టర్‌తో నీళ్లు పోస్తూ..

పుష్కర గిరాకీ అంతంతే..

ఆశించిన స్థాయిలో జరగని వ్యాపారం

- ఏడు రోజులుగా విక్రయాలు కొద్ది మొత్తంలోనే..
- పెట్టుబడి చేతికి వస్తుందో లేదో అని చిరు వ్యాపారుల ఆవేదన



గిరాకీ లేక వెలవెలబోతున్న చిరు వ్యాపార దుకాణాలు

కాటారం: పవిత్ర పుణ్యక్షేత్రమైన కాళేశ్వరంలో ఏ ఆధ్యాత్మిక కార్యక్రమం జరిగిన, ఏ పండుగ రోజు అయిన చిరు వ్యాపారుల ఉపాధికి కొదవ ఉండదు. కాళేశ్వరంలో జరిగే వేడుకలు ఉంటే చాలు జిల్లాతో పాటు వరంగల్, కరీంనగర్, మంచిర్యాల, హైదరాబాద్, మహారాష్ట్రాల నుంచి చిరు వ్యాపారులు ముందుగానే ఇక్కడకు చేరుకొని చిరు వ్యాపారాలు ప్రారంభిస్తారు. పూజాసామగ్రి, పూసలు, దండల దుకాణాలు, కిచెన్ సామగ్రి, వంట పాత్రలు, చిన్న పిల్లల బొమ్మలు, ఆకర్షించే వస్తువులు, ఇంటి అలంకరణ సామగ్రి, కూల్‌డ్రింక్స్, టిఫిన్ హోటల్స్ లాంటివి ఏర్పాటు చేసి భక్తులకు విక్రయిస్తుంటారు. త్రివేణి సంఘమ స్నానం, ఆలయ దర్శనానికి వచ్చే భక్తులు, మహిళలు, చిన్నారులు చిరు వ్యాపారుల వద్ద తమకు అవసరమైన వస్తువులు కొనుగోలు చేయడంతో వారికి ఉపాధి లభించేది. గతంలో నిర్వహించిన గోదావరి, ప్రాణహిత పుష్కరాల్లో సైతం పలు ప్రాంతాల నుంచి వచ్చిన చిరువ్యాపారులు తాము తీసుకొచ్చిన వస్తువులను విక్రయించి నాలుగు పైసలు సంపాదించుకున్నారు. కానీ ప్రస్తుతం సరస్వతీ నదికి కొనసాగుతున్న పుష్కరాల్లో చిరు వ్యాపారాలు ఢీలా పడ్డాయి.

భక్తుల తాకిడి ఎక్కువగా ఉంటుందని..

చిరు వ్యాపారులు ఆశించిన స్థాయిలో వ్యాపారాలు కొనసాగడం లేదు. ఈ నెల 15న సరస్వతీ పుష్కరాలు అంగరంగ వైభవంగా మొదలయ్యాయి. పన్నెండేళ్లకు ఒకసారి వచ్చే పుష్కరాలు కావడంతో పాటు వేసవి సెలవు రోజులు కావడంతో భక్తుల తాకిడి ఎక్కువగా ఉంటుందని భావించిన చిరు వ్యాపారులు ముందుగానే కాళేశ్వరం చేరుకొని తమ దుకాణాలు ఏర్పాటు చేసుకున్నారు. ఆలయ పరిసరాలతో పాటు గోదావరి ఘాట్‌కు వెళ్లే రహదారి, సరస్వతీ ఘాట్‌కు వెళ్లే దారి, ప్రధాన ప్రాంతాల్లో పలు రకాల చిరు సామగ్రి విక్రయ దుకాణాలను వ్యాపారులు పెట్టుకున్నారు. కానీ ఏడు రోజులుగా వారు ఆశించిన స్థాయిలో వ్యాపారం జరగడం లేదు. మొదటి మూడు రోజులు భక్తుల రాక అంతంత మాత్రంగానే ఉండగా వ్యాపారులకు కనీసం బోణీ కూడా కాలేదు. రోజు రోజుకు భక్తుల రద్దీ పెరుగుతున్నప్పటికి వ్యాపారాలు మాత్రం పుంజుకోవడం లేదు. ఆలయ పరిసరాల్లో భక్తులను ఎక్కువ సమయం ఉండనివ్వకపోవడం, భక్తుల రాకపోకల దారులను మారుస్తుండటంతో వ్యాపారాలు సరిగా జరగడం లేదని చిరు వ్యాపారులు తెలిపారు. కాగా ఇప్పటికే పలువురు చిరు వ్యాపారులు గిరాకీలు లేకపోవడంతో తమ దుకాణాలను ఎత్తేసి వెళ్లిపోయారు. కనీసం తమ పెట్టుబడి అయిన చేతికి వస్తుందో లేదో అని చిరు వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పుష్కరాలు మరో ఐదు రోజులు మిగిలి ఉండటంతో గిరాకీలు ఎలా ఉంటాయో అని వారు దిగులు చెందుతున్నారు.

అనుకున్నంత గిరాకీ లేదు..



మాది ఆలయం ఎదుట కూల్‌డ్రింక్స్, వాటర్ బాటిల్స్ దుకాణం. ఏ పండుగ వచ్చిన, ఏ ఉత్సవం జరిగిన మాకు గిరాకీ చాలా ఉండేది. కానీ ఈ పుష్కరాల్లో గిరాకీ అనుకున్నంత లేదు.

- సురేశ్, చిరువ్యాపారి

రోజుకు రూ.300 కూడా వస్తలేవు..



పుష్కరాలకు వచ్చే భక్తులకు కొబ్బరికాయలు, పూజ సామగ్రి అమ్ముకోవడానికి సరస్వతీ(వీఐపీ) ఘాట్ దారిలో చిన్న దుకాణం పెట్టుకున్న. కార్లు, బస్సులు, బైక్‌లు ఇలానే వెళ్తున్న ఎవరూ కొనడం లేదు. రోజంతా కూర్చొని ఉంటే రూ.300 కూడా వస్తలేవు.

- బాపు, చిరు వ్యాపారి

పోయిన పుష్కరాలే నయం..



కాళేశ్వరంలో రెండేళ్ల కిందట జరిగిన ప్రాణహిత పుష్కరాలే నయం. అప్పుడు పూసలు, దండలు, కుంకుమ డబ్బాల దుకాణం పెట్టుకొని నాలుగు పైసలు సంపాదించుకున్న. ఇప్పుడు కొనేటోళ్లే లేరు. పొద్దంత ఊరికనే కూర్చొని ఉండాల్సి వస్తుంది.

- నర్సమ్మ, చిరు వ్యాపారి

రూ.30 వేల పెట్టుబడి పెట్టిన



పుష్కరాలు అంటే భక్తులు చాలా మంది వస్తారు. వ్యాపారం మంచిగా ఉంటదనే ఆశతో రూ.30 వేలు పెట్టుబడి పెట్టి చిన్నపిల్లలు ఆడుకునే సామగ్రి కొనుక్కొని తెచ్చిన. అంతంత మాత్రంగానే అమ్ముడు పోతున్నాయి. పెట్టుబడి అయిన చేతికి వస్తుందో లేదో!.

- ఫిరోజ్, చిరు వ్యాపారి

నదీతీరం.. జనహారం


ప్రమిదలు వదులుతున్న మహిళలు





తమ చిన్నారులకు పుష్కర స్నానం చేయిస్తున్న కుటుంబ సభ్యులు


శునకాలకు పుష్కరస్నానం చేయిస్తున్న మహిళలు


దేవుళ్ల చిత్రపటం వద్ద పూజలు చేస్తున్న మహిళలు


నదిలో భక్తురాలి పూనకం




నదిలో సెల్ఫీ దిగుతున్న మహిళలు, చిన్నారులు


పుష్కర స్నానం ఆచరిస్తున్న భక్తజనం


పార్కింగ్ స్థలాల్లో నిలిపిన వాహనాలు (విహంగ వీక్షణం)


బురదలో దిగబడిన వ్యాన్‌ను తాడుతో బయటకు లాగుతున్న జేసీబీ


మొక్కుతున్న గిరిజన మహిళ


పుష్కర ఘాట్‌లో ఏర్పాటు చేసిన శివుడి ప్రతిమ వద్ద భక్తులు


ఆటోలు, కార్లు, ఇతర వాహనాల్లో పుష్కరాలకు విచ్చేస్తున్న భక్తులు


నవరత్నమాలిక హారతి ఇస్తున్న పండితులు

భూమి రిజిస్ట్రేషన్ చేయడం లేదని దంపతుల ఆత్మహత్యాయత్నం

తరిగొప్పుల: తాము కొనుగోలు చేసిన భూమిని అమ్మకందారుడు రిజిస్ట్రేషన్ చేయకుండా కాలయాపన చేస్తూ తీవ్ర ఇబ్బందులు గురిచేస్తున్నారని దంపతులు శరీరంపై పెట్రోల్ పోసుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. ఈ ఘటన బుధవారం మండల కేంద్రం శివారు ఎన్యానాయక్‌తండాలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. జనగామ జిల్లా చిల్పూరు మండలం శ్రీపతిపల్లికి చెందిన జంగ రవి తరిగొప్పుల మండలం ఎన్యానాయక్‌తండాకు చెందిన ముడావత్ సంపత్‌నాయక్ వద్ద 2 సంవత్సరాల క్రితం 2 గుంటల భూమిని గుంటకు రూ.3.30 లక్షల చొప్పున కొనుగోలు చేశాడు. అయితే ఆ భూమిని రిజిస్ట్రేషన్ చేయకుండా సంపత్‌నాయక్ కాలయాపన చేస్తూ వస్తున్నాడు. దీంతో రవి పెద్దమనుషులను ఆశ్రయించగా 2 గుంటలకు బదులు మరోచోట 8 గుంటల భూమి ఇవ్వాలని రెండు రోజుల క్రితం తీర్మానం చేశారు. సంపత్‌నాయక్ మరోచోట 8 గుంటల భూమికి హద్దులు చూపించగా ఆ భూమిని రవి మంగళవారం ట్రాక్టర్‌తో దున్నాడు. ఈ క్రమంలో ఏమైందో తెలియదు కానీ బుధవారం ఉదయం రవి తన భార్య, బిడ్డతో సంపత్‌నాయక్ ఇంటికి వచ్చి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. వెంటనే గ్రామస్తులు, కుటుంబ సభ్యులు ఆ దంపతులను వరంగల్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు.

'ఎల్‌సీ' నిర్లక్ష్యంపై సీఎండీ అసహనం


వీసీలో మాట్లాడుతున్న టీజీ ఎన్పీడీసీఎల్ సీఎండీ వరుణ్ రెడ్డి

- డ్యాష్ బోర్డులో వివరాల నమోదులో అలసత్వంపై సీరియస్

హన్మకొండ : ఎల్‌సీ యాప్ వినియోగంలో నిర్లక్ష్యంపై విద్యుత్ ఇంజనీర్లు, ఆపరేటర్లపై టీజీ ఎన్పీడీసీఎల్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ కర్నాటి వరుణ్ రెడ్డి అసహనం వ్యక్తం చేశారు. బుధవారం హనుమకొండలోని టీజీ ఎన్పీడీసీఎల్ ప్రధాన కార్యాలయం నుంచి 16 సర్కిళ్ల ఎస్ఈలు, డీఈలు, ఏడీఈ, ఏఈలతో వీడియో కాన్ఫరెన్స్ (వీసీ) నిర్వహించారు. ఎల్‌సీ యాప్ నిర్వహణ, డ్యాష్‌బోర్డులో పారామీటర్ల నమోదు, విద్యుత్ అంతరాయాలపై సమీక్షించారు. విద్యుత్ ప్రమాదాలు తగ్గించేందుకు, భద్రతకు అత్యంత ప్రాధాన్యత కల్పించేందుకు ప్రవేశ పెట్టిన ఎల్‌సీ యాప్‌పై నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. అదే విధంగా డ్యాష్ బోర్డులో ఎవరు ఏ పని చేస్తున్నారో నమోదు చేయకపోవడంపై సీరియస్ అయ్యారు. ఇక నుంచి అలసత్వం వహిస్తే ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్ డైరెక్టర్ టి.మధుసూదన్, చీఫ్ ఇంజనీర్లు రాజు చౌహాన్, అశోక్, జీఎం శ్రీనివాస్, ఎస్ఈలు, డీఈ, ఏడీఈ, ఏఈలు పాల్గొన్నారు.

మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలి

- శాంతి చర్చల కమిటీ చైర్మన్ జస్టిస్ చంద్ర కుమార్


మాట్లాడుతున్న జస్టిస్ చంద్ర కుమార్

హన్మకొండ: కేంద్ర ప్రభుత్వం తాత్సారం వీడి వెంటనే మావోయిస్టులతో శాంతి చర్చలు జరపాలని శాంతి చర్చల కమిటీ చైర్మన్ జస్టిస్ చంద్ర కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం హనుమకొండ నక్కలగుట్టలోని హోటల్ హరిత కాకతీయలో శాంతి చర్చల కమిటీ ఉమ్మడి జిల్లా ఆధ్వర్యంలో జైసింగ్ రాథోడ్ అధ్యక్షతన ప్రజా సంఘాల రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో జస్టిస్ చంద్ర కుమార్ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ మధ్య భారతదేశంలో పోలీసులు, మావోయిస్టుల మధ్య జరుగుతున్న అంతర్ యుద్ధంలో సామాన్య ప్రజలు, అమాయక ఆదివాసీలు చనిపోతున్నారన్నారు. రాజ్యం తరఫున పోలీసులు సైతం మరణించి మధ్య భారతమంతా నెత్తురోడుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మారణహోమాన్ని గమనించిన శాంతి చర్చల కమిటీ చేసిన అభ్యర్థన మేరకు మావోయిస్టు పార్టీ కాల్పులు విరమణ చేసి శాంతి చర్చలకు సిద్ధమని ప్రకటించిందన్నారు. కేంద్రం స్పందించకుండా దాడులను మరింత పెంచి సామాన్యులను సైతం చంపేస్తోందని, కాల్పుల విరమణ స్థితిలో ఉన్నవాళ్లను చుట్టుముట్టి చంపడం దుర్మార్గమని విమర్శించారు. ఇప్పటికైనా మావోయిస్టులతో శాంతి చర్చలు జరపడానికి ప్రధాని మోదీ, హోం మంత్రి వెంటనే నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం శాంతి చర్చల కమిటీ రాష్ట్ర సభ్యుడు సోమ రామమూర్తి, ఆల్ ఇండియా ఓబీసీ జాక్ చైర్మన్ సాయిని నరేందర్, ప్రొఫెసర్ కూరపాటి వెంకటనారాయణ, సిద్దబోయిన లక్ష్మీనారాయణ, చుంచు రాజేందర్, అనిక్ సిద్ధికి, చిల్ల రాజేంద్రప్రసాద్, బొట్ల భిక్షపతి, ప్రొఫెసర్ అన్వర్ ఖాన్ మాట్లాడారు. కార్యక్రమంలో న్యాయవాదులు అబ్దుల్ నబీ, పండుగ శ్రీనివాస్, ఆదినారాయణ, దొమ్మటి ప్రవీణ్ కుమార్, కొండ్ర నర్సింగరావు, తదితరులు పాల్గొన్నారు.

ఇస్రో నోడల్ సెంటర్ ఆర్ట్స్‌అండ్ సైన్స్ కళాశాల కోఆర్డినేటర్లుగా జితేందర్, సరిత


జితేందర్


సరిత

కేయూ క్యాంపస్: భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) అనుబంధ సంస్థ ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ రిమోట్ సెన్సింగ్ (ఇస్రో -ఐఆర్ఎస్) డెహ్రాడూన్ వరంగల్ ప్రాంతీయ కోఆర్డినేటర్లుగా హనుమకొండలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఫిజిక్స్ విభాగం కాంట్రాక్టు అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ జితేందర్, డాక్టర్ అలేటి సరిత నియమితులయ్యా రు. ఈ మేరకు ఇస్రో నుంచి సమాచారం అందిందని ఆ కళాశాల ప్రిన్సిపాల్ ఎస్. జ్యోతి బుధవారం తెలిపారు. ఉస్మానియా యూనివర్సిటీ తర్వాత హనుమకొండలోని ఆర్ట్స్ అండ్ సైన్స్ కాలేజీ ఇస్రో ఈ కోర్సెస్‌కు సంబంధించి నోడల్ సెంటర్‌గా ఉందన్నారు. విద్యార్థులు ఈ కోర్సెస్ అవకాశాన్ని వినియోగించుకోవాలన్నారు. కాగా, డాక్టర్ జితేందర్, డాక్టర్ సరితను ప్రిన్సిపాల్ జ్యోతి అభినందించారు.

పీజీ సెమిస్టర్ల ఫలితాలు విడుదల


ఫలితాలు విడుదల చేస్తున్న ప్రిన్సిపాల్ చంద్రమౌళి, పరీక్షల విభాగం అధికారులు

విద్యారణ్యపురి: హనుమకొండలోని పింగిళి ప్రభుత్వ మహిళా కళాశాల (అటానమస్)లో ఈఏడాది ఏప్రిల్‌లో నిర్వహించిన పీజీ కోర్సుల మొదటి, మూడో సెమిస్టర్ పరీక్షల ఫలితాలను బుధవారం ఆ కళాశాల ప్రిన్సిపాల్ చంద్రమౌళి విడుదల చేశారు. పీజీ కోర్సుల్లో మొదటి సెమిస్టర్ల పరీక్షల్లో మొత్తం 85 శాతం, మూడో సెమిస్టర్ పరీక్షల్లో 93శాతం మంది విద్యార్థినులు ఉత్తీర్ణులయ్యారని చంద్రమౌళి తెలిపారు. విద్యార్థినులు తమ ఫలితాలను సంబంధిత కాలేజీ వెబ్‌సైట్‌లోగాని లేదా కళాశాలలోని పరీక్షల విభాగంలో తెలుసుకోవచ్చని తెలిపారు. ఈ ఫలితాల విడుదల కార్యక్రమంలో పరీక్షల నియంత్రణాధికారి సుహాసిని, అదనపు పరీక్షల నియంత్రణాధికారులు కె. శ్రీనివాస్, పి. రాజిరెడ్డి, ఐక్యూఏసీ కోఆర్డినేటర్ సురేశ్ బాబు, వివిధ విభాగాల అధిపతులు పాల్గొన్నారు.

ఎత్తులు.. పైఎత్తులు

- తహసీల్దార్లా.. మజాకా
- ఎగ్జిక్యూటివ్ పోస్టు కోసం పట్టు
- కలెక్టరేట్‌లో ఉండేందుకు ససేమిరా...
- వేలేరు తహసీల్దార్ రిటెన్షన్
- కొందరికి ప్రజాప్రతినిధుల భరోసా
- హనుమకొండ జిల్లాలో తహసీల్దార్ల బదిలీలపై తీవ్ర చర్చ



హన్మకొండ అర్బన్: హనుమకొండ జిల్లాలో ఇటీవల జరిగిన తహసీల్దార్ల బదిలీలు.. వాటి వెనుకున్న రాజకీయ ప్రమేయంపై తీవ్ర చర్చ జరుగుతోంది. సాధారణ ఎన్నికల సమయంలో ఇతర జిల్లాల నుంచి తహసీల్దార్లు వచ్చారు. ఇక్కడి వారు ఇతర జిల్లాలకు వెళ్లారు. తాజాగా ప్రభుత్వం తహసీల్దార్ల అభ్యర్థన మేరకు గతంలో పనిచేసిన జిల్లాలకు తిరిగి పంపింది. దీంతో జిల్లాకు వచ్చినవారికి పోస్టింగ్స్ ఇచ్చే క్రమంలో ఆసక్తికర పరిణామాలు చోటు చేసుకున్నాయి. కొందరు కలెక్టరేట్, ఆర్డీఓ కార్యాలయాల్లో సూపరింటెండెంట్ పోస్టులు చేయడానికి ఆసక్తి చూపడం లేదు. తమకు ప్రాధాన్యం ఉన్న మండలాల్లో పోస్టు కావాలని ఉన్నతాధికారులపై వివిధ మార్గాల్లో ఒత్తిడి పెంచినట్లు తెలుస్తోంది. ఈక్రమంలో జిల్లాలోని 14 మండలాల్లోని కొన్ని కీలక ప్రాంతాల్లో పనిచేస్తున్న తహసీల్దార్లు తమ సీటుకు ఎక్కడ ముప్పు వస్తుందోనని ముందే స్థానిక ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులను ప్రసన్నం చేసుకుని, కదిలించకుండా చూడాలని తీవ్ర స్థాయిలో ప్రయత్నించారు. ముఖ్యంగా హసన్‌పర్తి, ధర్మసాగర్, ఐనవోలు, ఎల్కతుర్తి, కాజీపేట మండలాల విషయంలో అధికారులపై తీవ్ర ఒత్తిళ్లు వచ్చినట్లు సమాచారం. అటు అధికారులను, ఇటు ప్రజాప్రతిధులను సమన్వయ పరుస్తూ జిల్లా ఉన్నతాధికారులు పోస్టింగ్స్ ఇచ్చినట్లు ప్రచారం సాగుతోంది. కొన్ని మండలాల తహసీల్దార్లు తమ సీటుకు ఎసరు వస్తుందని ముందే పసిగట్టి స్థానిక ప్రజాప్రతినిధులను ప్రసన్నం చేసుకుని ఎలాగైనా స్థానచలనం కలగకుండా చూడాలని చివరి దాకా ప్రయత్నం చేసి దాదాపు సక్సెస్ అయ్యారనే చెప్పాలి. ఈక్రమంలో తమకేం కాదని, తమ మండలాలకు ఎవరూ రారులే అనుకుని ఉన్న వారికి మాత్రం ఊహించని రీతిలో బదిలీ జరిగినట్లు ప్రచారం సాగుతోంది.

అయినా అసంతృప్తి..

జిల్లాలో ప్రస్తుత బదిలీల్లో భీమదేవరపల్లి, నడికూడ, పరకాల, వేలేరు తహసీల్దార్ పోస్టులతోపాటు పరకాల డీఏఓ, కలెక్టరేట్ సూపరింటెండెంట్ పోస్టులకు కేటాయించారు. వారిలో కొందరికి మంచి పోస్టులే వచ్చినా.. తాము అనుకున్న స్థాయి పోస్టులు దక్కలేదని అసంతృప్తితో ఉన్నట్లు సమాచారం. ఇదిలా ఉండగా బదిలీల్లో వేలేరు తహసీల్దార్ కోమినిని కలెక్టరేట్‌కు, కలెక్టరేట్‌లో సూపరింటెండెంట్‌గా పనిచేస్తున్న ప్రసాద్‌ను వేలేరుకు బదిలీ చేస్తూ కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. కాగా, వాటిని బుధవారం మళ్లీ మార్పు చేస్తూ ఉత్తర్వులు వెలువడ్డాయి. అక్కడి నుంచి కలెక్టరేట్‌కు బదిలీ చేసిన తహసీల్దార్ కోమినిని వేలేరులోనే ఉండేలా, ప్రసాద్ కలెక్టరేట్‌లో ఉండేలా ఉత్తర్వులు ఇచ్చారు. మొత్తంగా చాలాకాలం తర్వాత జరిగిన తహసీల్దార్ల బదిలీలు ఉద్యోగ వర్గాల్లో తీవ్ర చర్చకు దారితీశాయి. త్వరలో జిల్లాకు మరో ఇద్దరు తహసీల్దార్లు వస్తారని ప్రచారం సాగుతోంది. దీంతో వారి రాక ఎవరి సీటుకు ఎసరుతెస్తుందోనని గుసగుసలు మొదలయ్యాయి.

సరస్వతి పుష్కరాలకు వన్ వే

నేటి నుంచి పుష్కరాలు ముగిసే వరకు అమల్లోకి..

భూపాలపల్లి: సరస్వతీనది పుష్కరాలకు వాహనాల రద్దీ పెరుగుతున్న నేపథ్యంలో నేటి (గురువారం) నుంచి కాళేశ్వరం రూట్‌ను వన్‌వేగా మారుస్తున్నట్లు ఎస్పీ కిరణ్ ఖరే బుధవారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం నుంచి పుష్కరాలు ముగిసే వరకు వన్ వే అమల్లో ఉంటుందన్నారు. హైదరాబాద్, వరంగల్, ఆపై ప్రాంతాల నుంచి వచ్చే వాహనాలు భూపాలపల్లి, కాటారం, మహదేవపూర్, అన్నారం స్తూపం మీదుగా చంద్రుపల్లి, మద్దులపల్లి మీదుగా కాళేశ్వరం చేరుకోవాలని, తిరుగు ప్రయాణంలో కాళేశ్వరం నుంచి మహదేవపూర్ మీదుగా తమ గమ్య స్థానాలకు వెళ్లాలని తెలిపారు. అలాగే, కరీంనగర్ నుంచి వచ్చే వాహనాలు మంథని, కాటారం, మహదేవపూర్, అన్నారం స్తూపం మీదుగా చంద్రుపల్లి, మద్దులపల్లి మీదుగా కాళేశ్వరం చేరుకోవాలని, తిరుగు ప్రయాణంలో కాళేశ్వరం నుంచి మహదేవపూర్ మీదుగా తమ గమ్య స్థానాలకు వెళ్లాలని సూచించారు. మహారాష్ట్ర, ఛత్తీస్‌గఢ్, ఆదిలాబాద్, మంచిర్యాల, నిర్మల్ నుంచి వచ్చే వాహనాలు సిరొంచ, అంతర్రాష్ట్ర బ్రిడ్జి మీదుగా కాళేశ్వరం చేరుకుని, తిరుగు ప్రయాణంలో కూడా అదే రూట్లో వెళ్లాలని ఎస్పీ కిరణ్ ఖరే సూచించారు.

విద్యుత్ షాక్‌తో వృద్ధురాలి మృతి

- ఇల్లు శుభ్రం చేస్తుండగా ఘటన
- 13 రోజుల్లో మనుమరాలి పెళ్లి.. అంతలోనే విషాదం


నర్సమ్మ (ఫైల్)

హసన్‌పర్తి: మనుమరాలి పెళ్లికి ఇల్లు శుభ్రం చేస్తున్న క్రమంలో విద్యుత్‌షాక్‌కు గురై ఓ వృద్ధురాలు మృతి చెందింది. ఈ ఘటన హసన్‌పర్తి మండలం జయగిరిలో చోటు చేసుకుంది. స్థానికుల కథనం ప్రకారం.. జయగిరికి చెందిన లింగాల నర్సమ్మ(60)కు ఇద్దరు కుమారులు మధు, చంద్రశేఖర్ సంతానం. మధు ఆర్టీసీ డ్రైవర్‌గా విధులు నిర్వహిస్తూ.. ఎనిమిదేళ్ల క్రితం మృతిచెందాడు. మధుకు భార్య, ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ప్రవీణ్ ఉన్నారు. మధు మృతి తర్వాత అతడి కుటుంబం బతుకుదెరువు నిమిత్తం రాంపూర్ వెళ్లింది. వచ్చే నెల 4న మధు చిన్న కూతురు పెళ్లి జరుగనుంది. జయగిరిలోనే పెళ్లి చేయాలని నిర్ణయించారు. ఈమేరకు ఇంటిని ముస్తాబు చేయడానికి ప్రవీణ్ జయగిరి వచ్చాడు. బుధవారం నానమ్మ నర్సమ్మతో కలిసి ప్రవీణ్ ఇల్లు శుభ్రం చేస్తున్నారు. ఈ క్రమంలో దండెంపై దుస్తులు ఆరేస్తున్న క్రమంలో నర్సమ్మ విద్యుత్ షాక్‌కు గురైంది. గమనించిన ప్రవీణ్ ఆమెను రక్షించడానికి యత్నించి ప్రాణాలతో బయటపడ్డాడు. ఈ ఘటనలో నర్సమ్మ అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలి కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీస్ ఇన్‌స్పెక్టర్ చేరాలు తెలిపారు.

పిడుగుపాటుకు ఇద్దరి మృతి

- మహబూబాబాద్ జిల్లాలో ఘటన


చేరాలు (ఫైల్)


ప్రవీణ్‌కుమార్ మృతదేహం

కొత్తగూడ/గూడూరు: పిడుగుపాటుకు మహబూబాబాద్ జిల్లాలో ఇద్దరు మృతి చెందారు. ఇందులో ఓ గొర్రెల కాపరి, ఓ యువకుడు ఉన్నారు. పోలీసులు, స్థానికుల కథనం ప్రకారం.. కొత్తగూడ మండలం ఓటాయికి చెందిన ఏశబోయిన చేరాలు(50) గొర్రెల కాపరిగా పని చేస్తున్నాడు. రోజువారీగా గొర్రెలను మేపేందుకు బుధవారం కూడా గ్రామ సమీపంలోని పొలాల్లోకి వెళ్లాడు. మధ్యాహ్నం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురుస్తుండగా గొర్రెలను తోలుకుని ఇంటికి వెళ్తున్న క్రమంలో పిడుగుపడింది. దీంతో చేరాలు అక్కడికక్కడే మృతి చెందాడు. మరో ఘటనలో గూడూరు మండలం గుండెంగ గ్రామానికి చెందిన మైదం సారయ్య కుమారుడు ప్రవీణ్‌కుమార్ (30) కూలీ పనులు చేసుకుంటూ కుటుంబానికి ఆసరా అవుతున్నాడు. ఈ క్రమంలో బుధవారం మధ్యాహ్నం బహిర్భూమికి వెళ్లిన ప్రవీణ్.. వర్షం వస్తుండడంతో రోడ్డు పక్కన చెట్టు కింద నిలబడ్డాడు. అదే సమయంలో చెట్టుపై పిడుగుపడడంతో ప్రవీణ్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటనపై మృతుడి తండ్రి సారయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై గిరిధర్‌రెడ్డి తెలిపారు.